

# థైరాయిడ్ బరువు వదిలించుకోలేక పోతున్నారా?

## దిగులుపడకండి.. ఈ చిట్కాతో ప్రాబ్లం సాల్వ్..

థైరాయిడ్ సమస్యలు మహిళల్లోనే ఎక్కువగా కనిపిస్తాయి. దీని కారణంగా హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. ఫలితంగా చాలా మంది మహిళలు ఊబకాయానికి గురవుతున్నారు. ఈ ఊబకాయాన్ని తగ్గించుకోవడానికి సరైన ఆహారం, వ్యాయామం రెండూ అవసరం. అయినప్పటికీ థైరాయిడ్ గ్రంథి పనితీరు మెరుగుపడకపోతే మహిళలు బరువు తగ్గడం కష్టం. అటువంటి పరిస్థితి మీరూ ఎదుర్కొంటుంటే ఈ సింపుల్ చిట్కా ప్రయత్నించి చూడండి. తప్పకుండా ఫలితం కనిపిస్తుంది.

**థైరాయిడ్ ఉంటే బరువు ఎందుకు పెరుగుతారు?**

హైపోథైరాయిడిజం ఉన్నవారిలో థైరాయిడ్ ఉత్పత్తి తగ్గుతుంది. దీని కారణంగా జీవక్రియ నెమ్మదిగా ఉంటుంది. కాబట్టి, అలాంటివారు క్రమంగా బరువు పెరుగుతారు. అందుకే మహిళలు ముందు నుంచే థైరాయిడ్ హార్మోన్ల పనితీరును నియంత్రించడంపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. థైరాయిడ్ కారణంగా ఎవరైనా బరువు పెరుగుతున్నట్లయితే వారు ఈ ఆహార నియమాలను పాటించాలి.

**థైరాయిడ్ ఉన్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

ఫైబర్, పీచు అధికంగా ఉండే ఆహారాలు తినాలి.

చక్కెర, రెడ్ మీట్, ఆల్కహాల్, వేపుళ్లు, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండండి.

ఆహారంలో సెలీనియం అధికంగా ఉండే ఆహారాలను చేర్చుకోండి.

రోజులో చాలాసార్లు కొద్ది కొద్ది పరిమాణంలో తింటూ ఉండాలి.

ఆహారంలో కార్బోహైడ్రేట్లను తగ్గించుకోవాలి.

తగినంత నీరు తాగాలి. దినచర్యలో వ్యాయామాన్ని చేర్చుకోండి.

**తినాల్సిన ఆహార పదార్థాలు**

బెర్రీలు (బ్లూబెర్రీస్, బ్లాక్బెర్రీస్, స్ట్రాబెర్రీస్, చెర్రీస్), సిట్రస్ పండ్లు (నారింజ, నిమ్మకాయలు), ఆకుకూరలు (పాలకూర, కాలే, కొల్లార్డ్ గ్రీన్స్),బ్రోకలీ, కాలీఫ్లవర్, టమోటాలు, ఓట్స్, క్వినోవా, బ్రౌన్ రైస్, హోల్ వీట్ బ్రెడ్, బాదం, వాల్‌నట్‌లు, అవిసె గింజలు, చియా గింజలు, పొద్దుతిరుగుడు విత్తనాలు, బీన్స్, చిక్కుళ్లు, కాయధాన్యాలు, శనగలు, పసుపు, అల్లం, వెల్లుల్లి, సాల్మన్, ట్యూనా, మాకేరెల్ చేపలు, గుడ్లు, చికెన్ తదితర యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఆహారాలు తినాలి.

**ఆక్యుప్రెషర్‌తో థైరాయిడ్ బరువు తగ్గించుకోండిలా..**

థైరాయిడ్ సమస్యలకు ఆక్యుప్రెషర్ ప్రభావవంతంగా పనిచేస్తుంది. నిజానికి వేర్వేరు సమస్యలకు వేర్వేరు ప్రెజర్ పాయింట్లు ఉంటాయి. థైరాయిడ్ కారణంగా బరువు పెరిగితే చేతిలో ఈ పాయింట్ వద్ద నొక్కడం వల్ల బరువు తగ్గుతారు. ఈ పీడన బిందువును యూనియన్ వ్యాలీ అంటారు. ఇది అనేక ఇతర నొప్పులకు కూడా సహాయపడుతుంది. రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. చూపుడు వేలు, బొటనవేలు మధ్య ఉండే మృదువైన భాగంపై చేత్తో ఒత్తిడి రాజేయడం వల్ల రక్త ప్రసరణ బలపడుతుంది. అలాగే, బొటనవేలు కీలును పట్టుకుని మసాజ్ చేయండి లేదా మరొక బొటనవేలు సహాయంతో ఈ భాగాన్ని నొక్కండి. రెండు చేతుల బొటనవేలు కీలును నొక్కడం లేదా మసాజ్ చేయడం ద్వారా థైరాయిడ్ హార్మోన్ పనితీరు నియంత్రించబడుతుంది. ఈ బిందువుపై ప్రతిరోజూ కనీసం ఐదు నిమిషాలు ఒత్తిడి ఉంచడం ప్రయోజనకరంగా ఉంటుంది.

# మీకు చక్కెర ఎక్కువగా తినే అలవాటు ఉందా.. జాగ్రత్త..



చక్కెర చాలా ప్రాసెసింగ్ ద్వారా తయారవుతుంది. దీనికి అనేక రకాల రసాయనాలు కలుపుతారు. కాబట్టి, ఒక రోజులో 20 గ్రాముల కంటే ఎక్కువ చక్కెర తినకూడదని నిపుణులు చెబుతారు. అయితే, కొంతమంది మాత్రం చక్కెరను అదే పనిగా తింటుంటారు. అయితే, ఈ అలవాటు మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పురుషులు చక్కెరను ఎక్కువగా తింటే ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందంటున్నారు.

**ఊబకాయం**

చక్కెర ఎక్కువగా తింటే చాలా సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే, ఇది కార్బోహైడ్రేట్. చక్కెర రక్తంలో త్వరగా కరిగి గ్లూకోజ్‌గా మారుతుంది. ఇది ఎక్కువ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే, ఈ శక్తి కొవ్వుగా మారి ఊబకాయం వచ్చేలా చేస్తుంది. ఇక ఊబకాయం వస్తే అన్నీ రోగాలు క్యూ కడతాయి. అందుకే నిపుణులు చక్కెర ఎక్కువగా తినడం ఆరోగ్యానికి మంచిది కాదని సూచిస్తున్నారు.

ఒక పరిశోధనలో చక్కెర ఎక్కువగా తింటే పురుషుల లైంగిక సామర్థ్యం తగ్గిపోతుందని తేలింది. 75 గ్రాముల చక్కెరను రెండు గంటల పాటు తీసుకోవడం వల్ల టెస్టోస్టెరాన్ స్థాయిలు 25 శాతం తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. చక్కెర ఎక్కువగా తింటే లైంగిక సామర్థ్యం 2 గంటల్లోనే బలహీనపడుతుందని అంటున్నారు. గ్లూకోజ్ తీసుకోవడం వల్ల పురుషులలో మొత్తం టెస్టోస్టెరాన్ స్థాయిలు గణనీయంగా తగ్గాయని పరిశోధనలు సూచించాయి.

# బూస్టర్ డోస్ తీసుకున్న వారికి కొవిడ్ రాదా?




దేశంలో కరోనా కేసులు మళ్లీ పెరగడం ప్రారంభించాయి. కొన్ని నెలల కిందటి వరకూ ఆసియాలోని పలు దేశాలను కుదిపేసిన కొవిడ్ కొత్త వేరియంట్లు ఇప్పుడు భారతదేశంలోనూ అడుగుపెట్టాయి. క్రమంగా దేశంలోని పలు రాష్ట్రాల్లో కేసులు పెరుగుతూ పోతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే కొవిడ్ నివారణకు ప్రజలు తీసుకున్న వ్యాక్సిన్ పనితీరుపై చర్చ మొదలైంది. బూస్టర్ డోస్ తీసుకున్న వ్యక్తులు మళ్లీ కొవిడ్ ఇన్ఫెక్షన్ బారిన పడతారా? లేదా ఈసారి మళ్ళీ టీకాలు వేసుకోవాల్సి వస్తుందా? ఈ సందేహాలపై వైద్యులు ఏమంటున్నారు?

ప్రపంచంలోని పలు దేశాలతో పాటు భారతదేశంలో కూడా కొవిడ్ కొత్త వేరియంట్ కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. మన దేశంలో ఇప్పటికే 1000 కి పైగా కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా కేరళలో (430), అత్యల్ప సంఖ్యలో ఢిల్లీలో (126) కొవిడ్ బారిన పడ్డారు. మహారాష్ట్రతో సహా అనేక ఇతర రాష్ట్రాల్లోనూ కొవిడ్ కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్య కేవలం రెండు వారాల్లోనే రెట్టింపు కావడం గమనార్హం. కొవిడ్ వ్యాప్తి వేగాన్ని చూసి మునుపటిలాగే వస్తుందేమో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

**కలవరం పుట్టిస్తున్న కొత్త వేరియంట్స్**

ఈసారి ఇండియాలో కొవిడ్ వైరస్ కొత్త వేరియంట్స్ కేసులు వెలుగుచూస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైద్యులు, శాస్త్రవేత్తలు కూడా కొత్త వేరియంట్ రోగనిరోధక శక్తి నుంచి కూడా తప్పించుకోవచ్చని అనుమానిస్తున్నారు. దీనివల్ల ఎక్కువ మంది ప్రజలు వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందని అంచనా. దీంతో కొత్త వేరియంట్ ప్రమాదాలను నివారించడానికి టీకా గురించి చర్చ కూడా ప్రారంభమైంది. అయితే కొత్త వేరియంట్లు అంత తీవ్రమైనవి కావని.. ప్రస్తుతానికి అవి ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**టీకాలు వేసిన వారికి కూడా ఇన్ఫెక్షన్ వస్తుందా?**

కొవిడ్ వ్యాక్సిన్ బూస్టర్ డోస్ లేదా రెండు డోసులు తీసుకున్న వ్యక్తులకు కొత్త వేరియంట్స్ సోకే ప్రమాదం చాలా తక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. అలాంటి వారికి ఈ వ్యాధి సోకినప్పటికీ తీవ్రమైన ఇన్ఫెక్షన్‌తో బాధపడరు. ఇప్పటివరకు జరిగిన పరిశోధనల ప్రకారం కొత్త వేరియంట్ ప్రభావం 4 లేదా 8 రోజుల పాటు ఉంటుంది. అందువల్ల దాని గురించి భయపడాల్సిన అవసరం లేదు. కానీ జాగ్రత్తగా ఉండటం ముఖ్యం. సామాజిక దూరం పాటిస్తూ శానిటైజర్ వాడాలి.

బూస్టర్ డోస్ తీసుకున్న వారిలో వైరస్ కు వ్యతిరేకంగా పోరాడే రోగనిరోధక శక్తి ఉందని డాక్టర్లు అంటున్నారు. వారికి వైరస్ నుండి తీవ్రమైన ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుంది, అయితే బూస్టర్ తీసుకునే వారికి ఇన్ఫెక్షన్ అస్సలు రాదనే విషయం నిజం కాదు. వారికి కూడా ఇన్ఫెక్షన్ సోకవచ్చు, కానీ లక్షణాలు తీవ్రంగా ఉండే అవకాశం లేదు.

# మామిడి పండ్లను ఫ్రిజ్‌లో ఉంచుతున్నారా..

## ఈ విషయాలను గుర్తుంచుకోండి..



మార్కెట్లు వివిధ రకాల మామిడి పండ్లతో నిండి ఉన్నాయి. మనం నచ్చినవాటిని ఇంటికి తెచ్చుకుని తరచుగా వాటిని ఫ్రిజ్‌లో ఉంచుతాము. కానీ, మామిడి పండ్లను ఫ్రిజ్‌లో నిల్వ చేయడం సరైనదేనా? మామిడిని ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల అది సహజంగా పండే ప్రక్రియపై ప్రభావం చూపుతుందా? దాని రుచి చెడిపోతుందా? ఇది మామిడి పోషక విలువలను కూడా ప్రభావితం చేస్తుందా? ఇలాంటి ప్రశ్నలు తరచుగా మన మనసులోకి వస్తాయి.

మామిడి పండ్లను ఫ్రిజ్‌లో నిల్వ చేసేటప్పుడు కొన్ని విషయాలను దృష్టిలో ఉంచుకుంటే ఫ్రిజ్‌లో ఉంచిన మామిడిపండ్లు కూడా తాజాగా, రుచికరంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. మామిడి పండ్లను ఫ్రిజ్‌లో పెట్టాలా వద్దా అనేది వాటి పక్వత స్థాయిపై ఆధారపడి ఉంటుందని గుర్తుంచుకోండి. కాబట్టి మామిడి పండ్లను ఫ్రిజ్‌లో ఉంచేటప్పుడు ఈ విషయాలను గుర్తుంచుకోండి.

మామిడి పండ్లు ఇంకా పచ్చిగా ఉంటే వాటిని గది ఉష్ణోగ్రత వద్ద ఉంచండి. మామిడి పండ్లు గది ఉష్ణోగ్రత వద్ద నెమ్మదిగా పక్వానికి వస్తాయి. వాటి రుచి, తీపి పెరుగుతుంది. మీరు మామిడి పండ్లను త్వరగా పండించాలనుకుంటే వాటిని సంచిలో ఉంచవచ్చు. ఈ పద్ధతిలో మామిడి పండ్లు త్వరగా పక్వానికి వస్తాయి.

**మామిడి పండ్లను ఎలా నిల్వ చేయాలి:**

మామిడి పండ్లు పూర్తిగా పండినప్పుడు వాటిని రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం మంచిది. మామిడి పండ్లను రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం వల్ల వాటి తాజాదనాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది. అవి దాదాపు ఐదు రోజుల పాటు మంచిగా ఉంటాయి. మామిడి పండ్లను రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయడం మంచిది. ఎందుకంటే ఇది తేమను నియంత్రిస్తుంది. పండ్లను తాజాగా ఉంచుతుంది.

**కట్ చేసిన మామిడి పండ్లను ఇలా నిల్వ చేయండి:**

మీరు మామిడిపండును కట్ చేసి ఉంటే దాని ముక్కలను గాలి చొరబడని కంటైనర్‌లో ఉంచి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయండి. ఈ విధంగా కోసిన మామిడి పండ్లు 3-4 రోజులు తాజాగా ఉంటాయి. అయితే, వాటిని తినే ముందు ఒకసారి చెక్ చేయండి.

**పండ్ల బుట్టలో నిల్వ చేయండి:**

మామిడి పండ్లను పండ్ల బుట్టలో వేసి చల్లని, పొడి ప్రదేశంలో ఉంచండి. ఇది మామిడిని గాలితో నింపి తాజాగా ఉంచుతుంది.





# భారతీయుల 'ఎనర్జీ డ్రింక్' ఇదే!

## కొత్త అధ్యయనంలో ఆసక్తికర విషయాలు

హైదరాబాద్: ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా విడుదలైన ఒక తాజా నివేదిక, భారతీయ ఆహారపు అలవాట్లలో కీలక మార్పులను, దైనందిన పోషక ఎంపికలపై ఆసక్తికర విషయాలను వెల్లడించింది. గోద్రేజ్ జెర్సీ ప్రచురించిన "బాటమ్స్ అప్... ఇండియా సేస్ చీర్స్ టు మిల్క్!" నివేదిక ప్రకారం, భారతదేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు పాలను తమ ప్రధాన శక్తినిచ్చే పానీయంగా ఎంచుకుంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో, 28 శాతం మంది వినియోగదారులు పాలను తమ రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకుంటున్నారు.

**పోషణ, జీవనశైలికి అనుగుణంగా...**

ఈ అధ్యయనం ప్రకారం, 53% మంది వినియోగదారులు సాధారణ పాలకు బదులుగా ఫ్లేవర్డ్ పాలను తీసుకోవడానికి లేదా ఇంట్లో పాలకు సహజమైన ఫ్లేవర్లను కలపడానికి ఇష్టపడుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో పాలను ఒక సులభమైన మార్గంగా చూస్తున్నారు. 47% మంది తల్లిదండ్రులు పగటిపూట తమ పిల్లలకు పాలను అందిస్తుండగా, 40% మంది ఆడుకునేటప్పుడు వారికి పోషకాలను అందించే పానీయంగా ఉపయోగిస్తున్నారు.

ఈ పరిశోధనల గురించి గోద్రేజ్ జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి మాట్లాడుతూ... "ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లలో పాలు ఒక ముఖ్యమైన భాగం. రుచి, రిఫ్రెష్‌మెంట్, పోషణకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, పాలు ఇప్పుడు నవతరం ఆధునిక జీవనశైలికి అనుగుణంగా మారుతున్నాయి. భారతదేశంలో ఆరోగ్య స్పృహ పెరుగుతున్న కొద్దీ, పాల వినియోగం గురించిన దృక్పథం మారుతోంది. పాలు కేవలం సంప్రదాయ ఆహారంగానే కాకుండా, ఆధునిక జీవనశైలికి అనుగుణంగా ఆవిష్కరణలను అందిస్తున్నాయి. పాలు రోజువారీ పోషక అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని పేర్కొన్నారు.

**ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం పాడి పరిశ్రమ...**

ఈ సర్వే ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాల నుండి పాల వినియోగ ప్రాధాన్యతలు, నాణ్యతా అంచనాలపై సమాచారాన్ని సేకరించింది. ఈ అధ్యయన ఫలితాలు, పెరుగుతున్న వినియోగదారుల ఆరోగ్య సంబంధిత డిమాండ్‌లకు అనుగుణంగా పాడి పరిశ్రమ ఆవిష్కరణలను, నాణ్యతను కలిపి భవిష్యత్ వృద్ధికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి.

